APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : శ్రీ సత్యసాయి / అనంతపురం ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 08, జూన్ 2026 సంపుటి: 01 సంచిక :12 పేజీలు : 04 వెల: 2-00/-

## టీజీ20 వేలం ప్రారంభం




హైదరాబాద్, జూన్ 7 : తెలంగాణ క్రికెట్‌కు కొత్త ఊపునిచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న టీజీ20 లీగ్‌కు సంబంధించిన మెగా వేలం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్ సిటీలోని కార్పొరేట్ హాల్‌లో ఆదివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు, ఫ్రాంచైజీ ప్రతినిధులు, క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలంగాణలోని యువ క్రికెటర్లకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ లీగ్‌ను నిర్వహిస్తుండగా, వేలం ప్రక్రియపై ప్రారంభం నుంచే ఉత్కంఠ నెలకొంది.




## లేపాక్షి వైభవం అపురూపం

- ఆధ్యాత్మికతకు నిలువెత్తు చిహ్నం
- శిల్పకళకు అద్భుత నిదర్శనం
- తప్పక సందర్శించాల్సిన క్షేత్రం
- మంత్రి సత్యకుమార్ యాదవ్

లేపాక్షి, జూన్ 7 : శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలో వెలసిన శ్రీ వీరభద్ర స్వామి సమేత దుర్గాదేవి ఆలయం భారతీయ ఆధ్యాత్మికత, శిల్పకళా వైభవం, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. లేపాక్షి క్షేత్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన ఆలయ విశిష్టతను కొనియాడారు.

## వారసత్వ కట్టడానికి పునర్జీవం




- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా
- చారిత్రక బావి పునరుద్ధరణ
- సీఐఎస్ఎఫ్ సేవలకు ప్రశంసలు

బెంగళూరు, జూన్ 7 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 సందర్భంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది చారిత్రక వారసత్వ పరిరక్షణలో విశేష కృషి చేశారు.

## యోగాంధ్రకు మంత్రి శ్రీకారం

- విజయవాడలో ప్రత్యేక కార్యక్రమం
- పోలీసులకు యోగా అవసరం
- గంజాయి రహిత రాష్ట్ర లక్ష్యం

విజయవాడ, జూన్ 7 : విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో 14 రోజుల యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు, ఈగల్ ఐజీ రవికృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ పాండ్యన్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,




## యోగాంధ్రకు మంత్రి శ్రీకారం

- లేపాక్షిలో ఘన ప్రారంభం
- యోగాపై అవగాహన పిలుపు
- ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం




లేపాక్షి, జూన్ 7 : అంతర్జాతీయ యోగా దినోత్సవం--2026 సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని శ్రీ వీరభద్ర స్వామి సమేత దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర--2026 కార్యక్రమాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఘనంగా ప్రారంభించారు.. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో కలిసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఆయన, యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఒక అద్భుతమైన మార్గమని అన్నారు. నేటి వేగవంతమైన జీవితంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలను అధిగమించడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.జూన్ 7 నుంచి 21 వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా




## ఈఆర్వో భవనానికి భట్టి శంకుస్థాపన

- ముదిగొండలో నూతన కార్యాలయం
- విద్యుత్ సేవలు మరింత చేరువ
- ప్రజా సౌకర్యాల విస్తరణే లక్ష్యం

ఖమ్మం, జూన్ 7 : ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో నిర్మించనున్న నూతన విద్యుత్ శాఖ ఈఆర్వో కార్యాలయ భవనానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.ప్రజలకు విద్యుత్ శాఖ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ భవన

## పెద్దాయన కోరిక తీర్చనున్న సీఎం




- వైరల్ వీడియోపై స్పందన
- సిద్ధాంతంలో కలుద్దామన్న చంద్రబాబు
- హర్షం వ్యక్తం చేస్తున్న నెటిజన్లు

అమరావతి, జూన్ 7 : సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి, ఓ సామాన్య అభిమాని కోరికను నెరవేర్చేందుకు ముందుకొచ్చారు. కామధేనువులంక గ్రామానికి చెందిన వృద్ధుడు సత్యనారాయణ తనను కలవాలనే ఆకాంక్ష వ్యక్తం

2వ పేజీలో




## కోహెడ రైతులకు బీజేపీ అండ

- రైతుల సమస్యలపై చర్చ
- భూ సేకరణపై ఆందోళన
- న్యాయం చేయాలని డిమాండ్

## విశాఖ నెల్లూరుపై లోకేష్ ప్రత్యేక దృష్టి

2 లో




- రేర్ ఎర్త్ ప్రాజెక్టులపై చర్చ
- మాస్కోలో కీలక సమావేశాలు

మాస్కో, జూన్ 7 : రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ మాస్కోలో కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ ఖనిజాల సంస్థ గిరెడ్‌మెట్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులతో సమావేశమైన ఆయన, ఆంధ్రప్రదేశ్‌లో ఆధునిక పారిశ్రామిక ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రాన్ని రేర్ ఎర్త్ ఖనిజాల ప్రాసెసింగ్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ సమావేశం కీలకంగా మారింది. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో లభించే భారీ ఖనిజ వనరులను వినియోగించుకుని డీప్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు.

# విశాఖ నెల్లూరుపై లోకేష్ ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తర్వాత)

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న రేర్ ఎర్త్ ఖనిజాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు తెరుస్తుందని ఆయన వివరించారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఎగుమతులు కూడా వృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే దేశంలో వేగంగా విస్తరిస్తున్న విద్యుత్ వాహనాలు, పవన విద్యుత్ రంగాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నెల్లూరు జిల్లాలో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గిరెడ్‌మెట్ సంస్థ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ ప్రాజెక్టు అవలైతే దేశీయ తయారీ రంగానికి గణనీయమైన ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను ఆధారంగా చేసుకుని రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అదే విధంగా నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ తయారీ కేంద్రం ఏర్పాటు ద్వారా ఆధునిక సాంకేతిక పరిశ్రమలకు అవసరమైన మౌలిక వేదికను రాష్ట్రంలో సృష్టించాలని భావిస్తున్నట్లు చెప్పారు. రష్యా పర్యటనలో భాగంగా మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియాన్ని కూడా మంత్రి లోకేష్ సందర్శించారు. విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమ్మేళనంగా నిలిచిన ఈ మ్యూజియం తనకు ప్రత్యేక అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఉపయోగించాలనే లక్ష్యంతో ఈ పర్యటన కొనసాగుతోందని తెలిపారు.

# పెద్దాయన కోరిక తీర్చనున్న సీఎం

(మొదటి పేజీ తర్వాత)

రేపు సిద్ధాంతంలో కలుద్దాం" అంటూ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. ముఖ్యమంత్రి స్పందన ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఇటీవల వైరల్ అయిన వీడియోలో ఓ యువకుడు సత్యనారాయణతో మాట్లాడాడు. ఈ సందర్భంగా "చంద్రబాబును ఎప్పుడైనా చూశారా?" అని ప్రశ్నించగా, ఆయన అమాయకంగా "ఆయన హైదరాబాద్‌లో ఉంటారని అంటారు, నేను మాత్రం చూడలేదు" అని సమాధానం ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రిని కలవాలనే కోరిక ఉందా అని అడగ్గా, తప్పకుండా చూడాలని ఉందంటూ తన మనసులోని అభిలాషను వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన యువకుడు, ఈ నెల 9న ముఖ్యమంత్రి సిద్ధాంతం వస్తున్నారని, తాను తప్పకుండా కలిసేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చాడు. ఆ మాటలు విన్న సత్యనారాయణ ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఆయన ముఖంలో కనిపించిన సంతోషం, అమాయకత్వం వీడియోను మరింత వైరల్ అయ్యేలా చేసింది. ఈ వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి చేరడంతో ఆయన వెంటనే స్పందించారు. పెద్దాయన కోరికను గౌరవిస్తూ స్వయంగా కలుస్తానని ప్రకటించారు. సిద్ధాంతం పర్యటన సందర్భంగా సత్యనారాయణను కలవనున్నట్లు స్పష్టం చేయడంతో ఈ ఘటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఒక సామాన్య అభిమాని మనసులోని కోరికను గుర్తించి వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజలకు చేరువగా ఉండే నాయకత్వానికి ఇది నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సత్యనారాయణకు ముఖ్యమంత్రితో భేటీ అయ్యే అవకాశం లభించడంతో ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




# లేపాక్షి వైభవం అపురూపం

(మొదటి పేజీ తర్వాత)

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ ఆలయం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సందర్శించాల్సిన పుణ్యక్షేత్రమని అన్నారు. విజయనగర సామ్రాజ్య కాలంలో నిర్మితమైన ఈ ఆలయం అద్భుత శిల్ప సంపదకు నిలయంగా నిలిచిందని మంత్రి తెలిపారు. ఆలయంలోని ప్రతి రాతి శిల్పం ఆ కాలం నాటి కళాకారుల నైపుణ్యానికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. శతాబ్దాల చరిత్రను తనలో దాచుకున్న ఈ క్షేత్రం భారతీయ సంస్కృతికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోందని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన వేలాడే స్తంభం లేపాక్షి ఆలయ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. నేలను పూర్తిగా తాకకుండా నిలిచిన ఈ స్తంభం నేటికీ సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేస్తోందని తెలిపారు. శాస్త్రీయంగా, శిల్పకళాపరంగా ఇది ఒక అద్భుత నిర్మాణమని అభివర్ణించారు. ఆలయానికి సమీపంలో ఉన్న మహా నంది విగ్రహం కూడా దేశంలోని అత్యంత విశిష్ట ఏకశిలా శిల్పాల్లో ఒకటిగా గుర్తింపు పొందిందని మంత్రి చెప్పారు. ఐదు వందల సంవత్సరాల క్రితం చిత్రీకరించిన కుడ్యచిత్రాలు నేటికీ తమ రంగుల కాంతిని కోల్పోకుండా ఉండటం గొప్ప విషయమని అన్నారు. ఇవి భారతీయ చిత్రకళా సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మికత, చరిత్ర, శిల్పకళ, సంస్కృతి అన్నీ ఒకేచోట దర్శనమిచ్చే అరుదైన క్షేత్రం లేపాక్షి అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రానికి గర్వకారణమైన ఈ పుణ్యక్షేత్రాన్ని దేశ విదేశాల పర్యాటకులు సందర్శించి భారతీయ వారసత్వ గొప్పతనాన్ని తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. లేపాక్షి ఖ్యాతిని మరింతగా ప్రపంచవ్యాప్తంగా చాటేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# ఈఆర్వో భవనానికి భట్టి శంకుస్థాపన

(మొదటి పేజీ తర్వాత)

ఆయన తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నూతన ఈఆర్వో కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా విద్యుత్ సంబంధిత సేవలు ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందనున్నాయని అన్నారు. వినియోగదారుల ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారం, కొత్త కనెక్షన్ల మంజూరు తదితర సేవలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యాలయం దోహదపడుతుందని వివరించారు. ప్రస్తుతం విద్యుత్ శాఖ సేవల కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి మండలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసన్నామని చెప్పారు. విద్యుత్ సేవల నాణ్యతను పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను ఆధునీకీకరించడంతో పాటు వినియోగదారులకు పారదర్శకమైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ స్థాయి సేవలు అందేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను విస్తరించడం, సేవల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా అభివృద్ధికి మరింత ఊతం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముదిగొండలో నిర్మించనున్న ఈఆర్వో కార్యాలయం పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# కోహెడ రైతులకు బీజేపీ అండ



(మొదటి పేజీ తర్వాత)

హైదరాబాద్, జూన్ 7 : రంగారెడ్డి జిల్లా కోహెడ గ్రామానికి చెందిన రైతుల ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కలిసింది. ప్రతిపాదిత సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియపై రైతులు తమ ఆందోళనలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలను పూర్తిగా విన్న రామచందర్ రావు, వారికి భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భూముల స్వాధీనానికి ముందు రైతులతో సమగ్రంగా చర్చించకపోవడం, సరైన నష్టపరిహారం అంశంపై స్పష్టత లేకపోవడం వల్ల తీవ్ర ఆందోళన నెలకొందని వివరించారు. తమ అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలపై స్పందించిన రామచందర్ రావు, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా తీసుకునే నిర్ణయాలు వివాదాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. రైతుల న్యాయమైన ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.
రైతుల అభ్యంతరాలు కొనసాగుతున్నప్పటికీ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించడం వల్ల అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. ఎర్త్‌మూవర్లతో పనులు ప్రారంభించడం, ఆందోళనలకు దిగిన రైతులపై చర్యలు తీసుకోవడం వంటి పరిణామాలు ఆందోళనకరమని పేర్కొన్నారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. కోహెడ రైతుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతుందని ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ వారి వెంట నిలుస్తుందని ఆయన తెలిపారు.

# టీజీ20 వేలం ప్రారంభం

(మొదటి పేజీ తర్వాత)

భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఆటగాళ్లు మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మ ఈ వేలంలో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శనలతో గుర్తింపు తెచ్చుకున్న సిరాజ్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి కనబరుస్తుండగా, ఇటీవల భారత జట్టులో కీలక బాధ్యతలు అందుకున్న తిలక్ వర్మ కోసం కూడా తీవ్ర పోటీ కనిపించింది. ఈ ఇద్దరు ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు భారీ మొత్తాలను వెచ్చించేందుకు సిద్ధంగా ఉండటంతో వేలం హాల్‌లో ఆసక్తికర వాతావరణం నెలకొంది.
దేశంలోని ప్రముఖ క్రికెట్ లీగ్‌ల వేలాలను విజయవంతంగా నిర్వహించిన చారు శర్మ ఈ వేలానికి అక్షనర్‌గా వ్యవహరిస్తున్నారు. తన అనుభవంతో వేలం ప్రక్రియను వేగవంతంగా, ఉత్కంఠభరితంగా కొనసాగిస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రతి ఆటగాడి పేరు ప్రకటించినప్పుడల్లా ఫ్రాంచైజీల మధ్య పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.
ఈ లీగ్ ద్వారా తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన యువ క్రికెటర్లకు పెద్ద వేదిక లభించనుంది. దేశ స్థాయి ఆటగాళ్లతో కలిసి ఆడే అవకాశం లభించడం ద్వారా వారి నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని నిర్వాహకులు భావిస్తున్నారు. స్థానిక ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో టీజీ20 లీగ్ కీలక పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ క్రికెట్ అభివృద్ధికి ఈ లీగ్ ఒక మైలురాయిగా నిలుస్తుందని క్రీడా వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

# యోగాంధ్రకు మంత్రి శ్రీకారం

(మొదటి పేజీ తర్వాత)

విస్తృత స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు సహా అన్ని స్థాయిల్లో యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. యోగా పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతుండటం సంతోషకరమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక సమతుల్యతను కూడా యోగా అందిస్తుందని వివరించారు. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా ప్రతి వయస్సు వారు యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యం కలిగిన లేపాక్షి క్షేత్రంలో యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభం కావడం విశేషమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న యోగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వారసత్వ కట్టడానికి పునర్జీవం

(మొదటి పేజీ తర్వాత)

ముడి పదార్థాల లభ్యత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష జరిగింది. దేశ ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా ఖనిజ, లోహ రంగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేయడం, ఖనిజాలు నుంచి తుది ఉత్పత్తుల వరకు విలువ ఆధారిత వ్యవస్థను మరింత బలపరచడం అత్యంత అవసరమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ అవసరాలను తీర్చేందుకు సంస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఖనిజ వనరుల భద్రత, స్థిరమైన అభివృద్ధి, దేశీయ ఉత్పత్తి పెంపు వంటి అంశాల్లో నాల్కో కీలక పాత్ర పోషించాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సహజ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన స్వావలంబన భారత్, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాల సాధనలో నాల్కో పాత్ర ఎంతో కీలకమని కిషన్ రెడ్డి అన్నారు. దేశీయ పరిశ్రమల బలోపేతం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఖనిజ రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో సంస్థ ముందుండాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఉత్పత్తి విస్తరణ, ఆధునిక సాంకేతికత వినియోగం, వనరుల సమర్థ నిర్వహణ ద్వారా నాల్కో దేశ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషిస్తుందని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ దిశగా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# యోగాంధ్రకు మంత్రి శ్రీకారం

(మొదటి పేజీ తర్వాత)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పోలీసు విధులు నిరంతర ఒత్తిడితో కూడుకున్నవని మంత్రి అన్నారు. అలాంటి పరిస్థితుల్లో పనిచేసే పోలీసు సిబ్బందికి యోగా ఒక సంజీవనిలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గడంతో పాటు ఏకాగ్రత, ఆరోగ్యం మెరుగుపడతాయని వివరించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరని అన్నారు. 'డ్రగ్స్‌పై దండయాత్ర' పేరుతో సైకిల్ యాత్ర నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా పోలీసులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. సమాజాన్ని డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయమైన 'గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ -- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మంత్రి పిలుపునిచ్చారు. యోగా, ఆరోగ్యకర జీవనశైలి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన రాష్ట్ర నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు.

అనంత సూర్య
తెలుగువార్త
సోమవారం 08, జూన్ 2026

# ఎస్ఐఆర్ ని ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలి



అనంతపురం, జూన్ 7 అనంత సూర్య : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలని రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు సూచించారు. రామగిరి మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, కో కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లతోపాటు ఆయా మండలాల ముఖ్యనాయకులంతా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి వారు పార్టీ శ్రేణులకు వివరించారు. ఈ కార్యక్రమం ఈనెల 15వ తేది నుంచి చేపట్టబోతోందని కావున క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారన్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని వివరించారు. ఎస్ఐర్ జరుగుతున్న సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మనకు సంబంధించిన ఓట్లు పోయే ప్రమాదం ఉందన్నారు. ఓట్ల ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోందని, ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకమని అన్నారు. కావున ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కూడా సీరియస్ తీసుకుని పని చేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూతుల వారిగా ఓటర్ జాబితాలను నాయకులకు అందజేశారు..

# విద్యార్థి దశ నుండే సామాజిక స్పృహ కలిగి ఉండాలి




అనంతపురం జూన్ 7 అనంత సూర్య : నగరంలోని సూర్య నగర్ రోడ్ లో గల చందన షాపింగ్ యాజమాన్యం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ , లలిత కళా పరిషత్ సెక్రటరీ గాజుల పద్మజ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆదిరెడ్డి పరదేశి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందన షాపింగ్ యాజమాన్యం వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో సామాజిక స్పృహ కలిగి ఉండడానికి ఇలాంటి పోటీలలో తమ నైపుణ్యాన్ని చాటుకోవడానికి దోహదపడతాయని, ఈ డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరిగిందని, జూనియర్స్ విభాగం లో పర్యావరణ పరిరక్షణ, అలాగే సీనియర్స్ విభాగం నందు మై డ్రీమ్ ఇండియా అనే అంశంపై నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథులైన బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాజుల పద్మజ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆదిరెడ్డి పరదేశి నాయుడు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే సమాజంలో ఉన్న అంశాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అనేక పోటీలలో పాల్గొనడం వల్ల విద్యతో పాటు విజ్ఞానం కూడా పెరుగుతుందని పోటీలలో గెలుపు ఓటములు సహజమని నేటి ఓటమి భవిష్యత్తు విజయానికి పునాది అని, ఈ సందర్భంగా చందన యాజమాన్యం వ్యాపార దృక్పథంతో కాకుండా సమాజ హితం కోసం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాన్స్, ఆర్ట్స్ మాస్టర్ కత్తి విజయ్ కుమార్, అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రమేష్, న్యాయవాది రంజిత్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ కే. మహేంద్ర, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమాన్ శోభాయాత్రపై డ్రోన్ కెమెరాలతో నిఘా

పెనుకొండ, జూన్ 7 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆదేశాల మేరకు పెనుకొండలో ఆదివారం నిర్వహించిన విరాట్ హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత దృష్ట్యా శోభాయాత్ర మార్గమంతా డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్‌ల ద్వారా కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్న శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



# సమాజంలో నాల్గవ స్తంభం పాత్రికేయులే

- సమాజంలో నా తండ్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డికి రాజకీయపరంగా కంటే గురువుగా ప్రత్యేక స్థానం
- ఒక గురువు కొడుకుగా ఎంతో గర్వపడుతున్నా..
- పాత్రికేయులకు ఎల్లప్పుడూ పల్లె కుటుంబం రుణపడి ఉంటాం..
- పుస్తకమే మనకు మంచి నేస్తం కావాలి
- బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మెన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి
- పల్లె ఉమా ట్రస్ట్ సహకారంతో 350 మంది పైచిలుకు పిల్లలకు ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉచిత విద్యా సామగ్రి పంపిణీ
- ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు






అనంతపురం, జూన్: 7 అనంత సూర్య న్యూస్ : సమాజానికి మంచి విజ్ఞానాన్ని అందించగలిగే శక్తి కేవలం గురువులకు, పాత్రికేయులకు మాత్రమే ఉందని బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. పల్లె ఉమా ట్రస్ట్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ఉచిత విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడారు. సమాజంలో తన తండ్రి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి రాజకీయ నాయకుడిగా, మాజీ మంత్రి గా కంటే గురువుగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అందుకే ఒక గురువు కుమారుడిగా తాను ఎంతో గర్వపడుతున్నానని ఈ సందర్భంగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రధానంగా ఎక్కువగా పని ఒత్తిడిలో తల్లిదండ్రులు పడి స్వంతకుటుంబ సభ్యులతో ఎక్కువ సేపు గడపలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటిలో ఇప్పుడు ఉన్న పిల్లలు మొబైల్ ఫోన్లకు అధికంగా అలవాటు పడటం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి పరిస్థితుల్లో పిల్లలకు పుస్తకాలను మంచి మిత్రులుగా అందించాలని కోరారు. ఈ పోటీ ప్రపంచంలో పుస్తకాలను బాగా చదివి విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. పల్లె కుటుంబానికి సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు రావడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని వారి మేలు ఎన్నటికి మర్చిపోలేమని అన్నారు. పాత్రికేయులకు కోసం పల్లె కుటుంబం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని, భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా 350 మంది పాత్రికేయుల పిల్లలకు ఉచిత నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం 350 పాత్రికేయ కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు, ఫెడరేషన్ నాయకులు పలువురు పాత్రికేయులు అనిల్ కుమార్ రెడ్డి, సంతోష్ రెడ్డి, జగదీశ్, సూర్య, కేశవ్, శ్రీరాములు, రవి, సుధాకర్, ఆనంద్, పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, అనంతపురం స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పలువురు జర్నలిస్టుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో ... నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



పుట్టపర్తి, జూన్ 7 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లాలో సోమవారం (జూన్ 8) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ వినతులను జిల్లా కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా ఎవవఎశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను ముందుగా ఆయా మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలతో ఉన్నవారే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు హాజరుకావాలని సూచించారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో జరిగే జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

# బెస్త కులస్తులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుంది





అనంతపురం, జూన్ 7 అనంత సూర్య : కూటమి ప్రభుత్వం బెస్త కులస్తులకు, మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అతిథులు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, టిడిపి నాయకులతో కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొని నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చేపల హరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. బెస్త సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చేపల హరి సేవా దృక్పథం కలిగిన నాయకుడని కొనియాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత పార్టీ యూనిట్ ఇన్‌చార్జిగా సమర్థవంతంగా పనిచేశారని, ప్రస్తుతం క్లస్టర్ ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిని జిల్లా బెస్త సేవా సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. చేపల హరిని అధ్యక్షుడిగా ఎన్నుకున్న జిల్లా వ్యాప్తంగా ఉన్న బెస్త కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై నూతన అధ్యక్షుడిని ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. బెస్త సామాజిక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. బెస్త సంఘం నాయకులు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం చేసిన విజ్ఞప్తిని వెంటనే సానుకూలంగా స్వీకరించినట్లు తెలిపారు. ఎంపీ నిధుల ద్వారా రూ. 80 లక్షలు, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా కాంపౌండ్ వాల్, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ. 35 లక్షలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. మొత్తంగా రూ. 1.15 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో కూడిన బెస్త కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. చేపల హరి వంటి యువ నాయకులకు రాజకీయంగా కూడా మంచి భవిష్యత్తు ఉందని, భవిష్యత్తులో కార్పొరేటర్‌గా అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, బెస్త సేవా సంఘం ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో బెస్త సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి..
# 8 మంది అరెస్ట్




తలుపుల, జూన్ 7 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆదేశాల మేరకు డీఎస్పీ శివన్నారాయణస్వామి పర్యవేక్షణలో తలుపుల పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు కొనసాగిస్తున్నారు.ఆదివారం అందిన సమాచారం మేరకు తలుపుల ఎస్ఐ చెన్నయ్య సిబ్బందితో కలిసి గుండువారిపల్లి గ్రామంలోని ఓ ఇంటిపై ఆకస్మికంగా దాడి నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.32,760 నగదుతో పాటు పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.తలుపుల మండలంలో జూదం, అక్రమ మద్యం, మత్తు పదార్థాల విక్రయాలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఎస్ఐ చెన్నయ్య విజ్ఞప్తి చేశారు.

# వందే భారత్‌కు తృటిలో ప్రమాదం తప్పింది

హిందూపురం, జూన్ 7 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం--దేవరపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తృటిలో తప్పింది. కాచిగూడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న రైలు దేవరపల్లి సమీపానికి చేరుకోగానే పట్టాలపైకి వచ్చిన ఆవును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆవు అక్కడికక్కడే మృతి చెందగా, రైలు ముందు భాగం దెబ్బతింది.ఘటనతో లోకో పైలట్ అప్రమత్తంగా రైలును నిలిపివేయడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.ఒక్కసారిగా రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు కొద్దిసేపు



ఆందోళనకు గురయ్యారు. అనంతరం రైల్వే సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని దెబ్బతిన్న భాగాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు.ఈ ఘటన కారణంగా ఆ మార్గంలో సుమారు గంటపాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## శ్రీ సత్యసాయి సమగ్ర విద్యా విధానంపై
# వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్ ప్రశంసలు

పుట్టపర్తి, జూన్ 7 అనంత సూర్య: వెనిజులా బొలివేరియన్ రిపబ్లిక్ తాత్కాలిక అధ్యక్షురాలు హర్ ఎక్సలెన్సీ డెల్సీ రోడ్రిగెస్ ఆదివారం విద్యాగిరిలోని శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ను సందర్శించారు.శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.



రత్నాకర్ ఆమెకు స్వాగతం పలకగా, ఉపకులపతి ప్రొఫెసర్ బి. రాఘవేంద్ర ప్రసాద్ సంస్థ విద్యా ప్రస్థానం, విలువల ఆధారిత సమగ్ర విద్యా విధానం, పరిశోధనలు, సామాజిక సేవా కార్యక్రమాలపై సమగ్ర అవలోకనం అందించారు.ఈ సందర్భంగా డెల్సీ రోడ్రిగెస్ మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి సమగ్ర విద్యా విధానాన్ని ప్రశంసించారు. నేటి ప్రపంచంలో మానవ విలువల ఆధారిత విద్య అత్యంత అవసరమని పేర్కొంటూ, విద్యా ప్రావీణ్యాన్ని వ్యక్తిత్వ వికాసంతో సమన్వయం చేయడంలో శ్రీ సత్య సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ ఆదర్శంగా నిలుస్తోందని అభినందించారు. సంస్థ చేపడుతున్న పరిశోధన కార్యక్రమాల పట్ల కూడా ఆసక్తి వ్యక్తం చేశారు.ఈ సందర్శన సందర్భంగా ఇరుపక్షాల మధ్య విద్య, సేవ, మానవ విలువల పరిరక్షణపై భావపూర్వక చర్చలు జరిగాయి.

# మహిళల గురించి మాట్లాడేటప్పుడు తస్మాత్ జాగ్రత్త.. – ప్రకాష్ రెడ్డి




అనంతపురం, జూన్ 7 అనంత సూర్య : మహిళల గురించి మాట్లాడేటప్పుడు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలంటూ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి టిడిపి మహిళా నేతలు హెచ్చరించారు. రాప్తాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళా నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. మూడు రోజుల క్రితం ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాష్ రెడ్డి నువ్వు మాట్లాడిన మాటలు కేవలం సునీతమ్మ గురించి మాత్రమే కాదని.. యావత్ మహిళా లోకం గురించి అని మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గంలోని ప్రతి మహిళ నీ వ్యాఖ్యలు విని బాధపడుతున్నారన్నారు. నీకు ఏమాత్రం సంస్కారం ఉన్నా మహిళలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో ఏం అభివృద్ధి జరుగుతుందన్నది మొత్తం రాష్ట్రానికి తెలుసునని నువ్వు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 2014 నుంచి 19 మధ్య కాలంలో పరిటాల సునీతమ్మ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఆ తర్వాత ఈ రెండేళ్లలోనే రికార్డ్ స్థాయిలో రోడ్ల నిర్మాణాలు చేశారన్నారు. వాస్తవంగా నువ్వు అధికారంలో ఉన్నప్పుడు మంత్రుల కాళ్లు పట్టుకొని పనులు చేయలేదని నిలదీశారు. చెన్నేకొత్తపల్లి పక్కనే ఉన్న అప్పటి మంత్రి శంకర్ నారాయణ కాళ్లు పట్టుకొని రోడ్లు ఎందుకు వేయించలేదని నిలదీశారు. ఇటు కళ్యాణదుర్గంలో ఉన్న ఉషశ్రీ చరణ్ కాళ్లు పట్టుకొని ఎందుకు అంగన్వాడీ భవనాల నిర్మాణాలు చేపట్టలేదని నిలదీశారు ఏదో అదృష్టం కొద్ది ఒక్కసారి గెలిచి నువ్వు మీ జగన్ రెడ్డిలు ఎంజాయ్ చేసి పోయారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా సింగిల్ టైం ముఖ్యమంత్రిగా మిగిలిపోతారో.. మీరు కూడా సింగిల్ టైం ఎమ్మెల్యే గానే ఉండిపోతారని మహిళా నేతలు అన్నారు. పరిటాల కుటుంబం గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రకాష్ రెడ్డికి లేదన్నారు. పరిటాల రవిని అత్యంత దారుణంగా హత్య చేసిన తర్వాత మహిళ అయినా ఎక్కడా వెనుకడుగు వేయకుండా పరిటాల సునీతమ్మ రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలబడ్డారన్నారు. అలాంటి మహిళా నాయకురాలి పట్ల ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మహిళలు ఊరుకోరని ప్రకాష్ రెడ్డికి హెచ్చరించారు.



# ఉన్నత స్థానమే లక్ష్యంగా.. ఎదగాలి

- సమాజానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలి
- గౌడ/ఈడిగ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో అతిథుల పిలుపు

అనంతపురం, జూన్ 7 అనంత సూర్య న్యూస్ :

విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తద్వారా తమను కంటికి రెప్పలా పెంచిన తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ముఖ్యఅతిథులు పిలుపు నిచ్చారు. నగరంలోని రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మండపంలో ఈడిగ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఈడిగ, గౌడ ప్రతిభా పురస్కార అవార్డు ప్రదానోత్సవ" కార్యక్రమానికి ముఖ్యఅతిథులు గా వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ రమేష్ గౌడ్, శ్రీ రేణుక ఎల్లమ్మ సొసైటీ గౌరవ సలహాదారు బుర్రా ఆదినారాయణ గౌడ్, అధ్యక్షుడు జగలేటి నాగేశ్వరరావు గౌడ్, ఈడిగ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్ర కుమార్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగ సంఘం గోపాల్ గౌడ్, ఉద్యోగస్తుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం గౌడ్, డాక్టర్ శంకర్ గౌడ్, దివాకర్ గౌడ్, స్వరూప్ బాబు గౌడ్, ఈశ్వరయ్య గౌడ్, మార్కండేయ గౌడ్, శంకర్ గౌడ్, సుధాకర్ గౌడ్, ఓబన్న గౌడ్, బలరాముడుగౌడ్, లక్ష్మీ నారాయణ గౌడ్, శివయ్య గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈడిగ ఉద్యోగ స్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు విశ్వనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో 16వ ప్రతిభ పురస్కారం ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 62 మంది ఈడిగ గౌడ విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ముఖ్యఅతిథులు అందజేశారు.

ఈ సందర్భంగా వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, ఈడిగ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు విశ్వనాథగౌడ్ లు మాట్లాడుతూ.. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, మనం ఈ స్థాయికి రావడానికి కారణమైన తల్లిదండ్రులను, మనల్ని ప్రోత్సహించిన వారిని ఎన్నటికీ మరవకూడదని హితవు పలికారు. అవార్డులు అందుకున్న విద్యార్థులు రేపటి సమాజానికి దిక్సూచి కావాలని, విద్య ఒక్కటే మన జీవితాలను, మన సమాజాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధం అని పేర్కొన్నారు. గౌడ, ఈడిగ కులాల అభ్యున్నతికి, విద్యార్థుల ప్రోత్సాహానికి ఇటువంటి పురస్కారాల ప్రదానోత్సవాలు ఎంతో దోహదపడతాయన్నారు.

గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చి, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ప్రతిభ చాటిన విద్యార్థులను ఈ వేదికపై ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో ఈడిగ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం నాయకులు మనోహర్ గౌడ్, విజయ్ గౌడ్, శివానంద గౌడ్, ఆదినారాయణ గౌడ్, మహేష్ గౌడ్, లాలెప్ప గౌడ్, మోహన్ గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405